క్లుప్తంగా

క్రీడా విజేతలకు బహుమతి ప్రదానం



ఇబ్రహీంపట్నం: ఎన్టీటీపీఎస్‌లో ఉగాది ఉత్సవ్ అసిస్టెంట్స్ ఇంజినీర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి ఉగాది వేడుకలు ఘనంగా జరిగాయి. ముఖ్యఅతిథిగా హాజరైన సంస్థ చీఫ్ ఇంజినీర్ టి.నాగరాజు మాట్లాడుతూ ఇటువంటి వేడుకలు వత్తిడి తగ్గించి ఉల్లాసాన్ని నింపుతాయన్నారు. వివిధ రకాల క్రీడలు, పలు రకాల స్టాల్స్, ఫుడ్ కోర్టులు ఏర్పాటు చేశారు. క్రీడల్లో విజేతలకు జ్ఞాపికలు అందజేశారు. అసోసియేషన్ అధ్యక్షుడు సునీల్ దత్, కార్యదర్శి ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు. కొండపల్లి జెడ్పీ బాలికల పాఠశాల హిందీ ఉపాధ్యాయిని మంగళగిరి సుహాసినికి పీఆర్టీయూ ఆధ్వర్యంలో ఉగాది పురస్కారం లభించింది. కేజీబీవీ కార్యదర్శి దేవానందరెడ్డి, పీఆర్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు డి.శ్రీను పురస్కారం అందజేశారు.

మజ్జిగ పంపిణీ



తిరువూరు: తిరువూరు ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో సోమవారం స్థానిక బస్టాండు సెంటర్లో మజ్జిగ చలివేంద్రం నిర్వహించారు. గత 16 రోజులుగా నిర్వహిస్తున్న చలివేంద్రంలో దాతల సహకారంతో మజ్జిగ సరఫరా చేస్తున్నట్లు సంఘ అధ్యక్ష కార్యదర్శులు జంగాల మురళీకృష్ణ, నాళ్ళా సురేంద్ర తెలిపారు. వేసవి ఎండల తీవ్రత తగ్గేవరకు చలివేంద్రం కొనసాగిస్తామని తెలిపారు. చలివేంద్రం నిర్వహణలో ఆర్యవైశ్య సంఘ కోశాధికారి పీవీ రావు, వాసవీ సేవా దళ్ చైర్మన్ దోసపాటి రవి కుమార్, పీఆర్వో నాళ్ళా సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఎంపీపీకి కృతజ్ఞతలు తెలిపిన ముస్లింలు



జి.కొండూరు: మండల పరిధిలోని కవులూరు గ్రామంలో స్థానిక ముస్లింల అభ్యర్థన మేరకు ఎంపీపీ వేములకొండ లక్ష్మీతిరుపతమ్మ మండల పరిషత్ నిధులు రూ.4లక్షలను కేటాయించి ఈద్గాను అభివృద్ధి చేయించారు. ఈ క్రమంలో రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకుని సోమవారం ఎంపీపీని ప్రత్యేకంగా ఆహ్వానించిన ముస్లింలు ఆమెకు కృతజ్ఞతలు తెలియజేశారు.

వక్ఫ్ బోర్డు బిల్లుకు వ్యతిరేకంగా నల్ల రిబ్బన్లతో నిరసన



మైలవరం: వక్ఫ్ బోర్డు బిల్లుకు వ్యతిరేకంగా మైలవరంలో ముస్లిమ్‌లు నల్ల రిబ్బన్లు ధరించి సోమవారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. రంజాన్ పండుగ సందర్భంగా ముస్లింలు భక్తి శ్రద్ధలతో ఈద్గాలో ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం ముస్లింలు వక్ఫ్ బోర్డు బిల్లును ఉప సంహరించుకోవాలని కోరుతూ నల్ల రిబ్బన్లతో నిరసన తెలియజేశారు.

పోలీసుల అదుపులో 8 మంది జూదరులు

మైలవరం: ఎన్టీఆర్ జిల్లా మైలవరం నియోజకవర్గం రెడ్డిగూడెంలో కోడి పందేల శిబిరంపై సోమవారం పోలీసులు దాడి చేసి 8 మంది జూదరులను అదుపులోకి తీసుకున్నట్లు రెడ్డిగూడెం ఎస్ఐ మోహనరావు తెలిపారు. ఈ దాడిలో 8 మంది జూదరులను అదుపులోకి తీసుకుని, వారి వద్ద నుంచి రూ.6,500 నగదు, ఐదు పందెం కోళ్లు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేకాట, కోడి పందేలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ మోహనరావు హెచ్చరించారు.

ఇండోర్ స్టేడియంలో సౌకర్యాలు కరువు

- ఇరుకు గదుల్లో క్రీడాకారుల ఇక్కట్లు
- పాడైపోయిన జిమ్ సామగ్రి
- 8 సంవత్సరాలుగా పట్టించుకోని అధికారులు



తిరువూరు ఇండోర్ స్టేడియం భవనం



తిరువూరు జిమ్‌లో పాడైపోయిన పరికరాలు

తిరువూరు: తిరువూరులోని ఎన్టీఆర్ ఇండోర్ స్టేడియంలో సరైన సౌకర్యాలు లేక క్రీడాకారులు ఇబ్బంది పడుతున్నారు. ఎనిమిది సంవత్సరాల క్రితం ప్రారంభించిన ఈ స్టేడియంలో జిమ్, షటిల్, క్యారమ్స్, టెన్నిస్ క్రీడలకు మాత్రమే ఏర్పాట్లు చేశారు. నాలుగు సంవత్సరాల క్రితం ఇక్కడ రెవెన్యూ డివిజన్ కార్యాలయం ఏర్పాటు చేయడంతో జిమ్ ప్రాక్టీస్ గదులను, టెన్నిస్ కోర్టును ఖాళీ చేయాల్సి వచ్చింది. ప్రస్తుతం ఇరుకు గదులలో ఇండోర్ స్టేడియం కొనసాగుతోంది. రోజుకు 100 మందికి పైగా క్రీడాకారులు ప్రాక్టీస్ చేసుకునే విధంగా నిర్మించిన ఈ స్టేడియంలో ఇప్పుడు 20 మంది కూడా రావడం లేదు. పట్టణంలోని ప్రైవేటు జిమ్‌లలో నెలకు రూ.2వేల వరకు ఫీజు వసూలు చేస్తుండడంతో పేద, సామాన్య యువకులకు అవి అందుబాటులో లేని పరిస్థితి. ఎన్టీఆర్ ఇండోర్ స్టేడియంలో అన్ని క్రీడలకు అవకాశం కల్పిస్తే తమకు సౌకర్యవంతంగా ఉంటుందని వారు చెబుతున్నారు.

నిర్వహణ లేక మూలపడిన సామగ్రి

తిరువూరు ఇండోర్ స్టేడియంలో క్రీడా పరికరాలు కనీస నిర్వహణ లేక మూలపడ్డాయి. జిమ్ ప్రాక్టీస్ చేసే సామగ్రి విరిగి, పాడైపోగా వాటి స్థానంలో కొత్తవి ఏర్పాటు చేయలేదు. జిల్లా క్రీడాభివృద్ధి సంస్థకు జిమ్ కోచ్‌లను నియమించే అవకాశం లేక పోవడంతో స్థానిక యువకులే కోచ్‌ను నియమించుకుని వేతనాలు చెల్లించాల్సి వస్తోంది. వెయిట్ లిఫ్టింగ్ మినహా జిమ్ ప్రాక్టీషనర్లకు ఇతర సామగ్రి ఏవీ అందుబాటులో లేవు. షటిల్ కోర్టుకు కూడా అవసరమైన మరమ్మతులు చేయించాలని క్రీడాకారులు కోరుతున్నా పట్టించుకునే వారే లేరు. ప్రస్తుతం 10, 15 మంది మాత్రమే ఈ కోర్టుకు వస్తున్నారు. క్యారమ్స్, టెన్నిస్ కోర్టు కూడా ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

భవనాలు లేక ఇబ్బందులు

ఇండోర్ స్టేడియం కోసం నిర్మించిన రెండు బ్లాకుల్లో ఒకటి రెవెన్యూ డివిజనల్ అధికారి కార్యాలయానికి కేటాయించగా, రెండో భవనం క్రీడాప్రాంగణాల ఏర్పాటుకు సరిపోవట్లేదు. టెన్నిస్ కోర్టు ఏర్పాటు చేసేందుకు అవకాశం ఉన్నా స్థలాభావంతో జిల్లా క్రీడాభివృద్ధి సంస్థ అధికారులు వెనుకాడుతున్నారు. జిల్లాలో నందిగామ, జగ్గయ్యపేట స్టేడియంలకు ఇటీవల కొత్త పరికరాల కొనుగోలుకు ఇంజినీరింగ్ అధికారులు ప్రతిపాదనలు పంపగా ప్రభుత్వం ఆమోదించినట్లు క్రీడాకారులు చెబుతున్నారు. తిరువూరు స్టేడియంలో కూడా అవసరమైన సదుపాయాలతో పాటు కొత్త పరికరాలు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నాం

తిరువూరు ఇండోర్ స్టేడియంలో క్రీడాకారుల విజ్ఞప్తి మేరకు అవసరమైన సదుపాయాలు కల్పిస్తాం. జిమ్ కోసం కోచ్‌ని క్రీడాభివృద్ధి సంస్థ నియమించే అవకాశం లేదు.

– సిరాజ్, జిల్లా క్రీడాభివృద్ధి అధికారి

సర్వ మానవ సమతకు ప్రతీక రంజాన్



తిరువూరు ఈద్గాలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తున్న ముస్లింలు



ఈద్గా వద్ద రంజాన్ శుభాకాంక్షలు తెలుపుతున్న మంత్రి కొలుసు పార్థసారథి

మైలవరం: అల్లాహ్ రక్షణ, కరుణ పొందడానికి రంజాన్ మాసంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తూ, బీద, ధనిక తారతమ్యం లేకుండా ప్రతి ఒక్కరూ తమకు ఉన్న దానిలోనే ఎంతో కొంత పేదలకు సాయం చేస్తూ సేవా దృక్పథాన్ని చాటుకోవాలని ముస్లిమ్‌ల మత గురువు ఇమామ్ సాహెబ్ షబ్బీర్ అహ్మద్ తెలిపారు. రంజాన్ పండుగ సందర్భంగా మైలవరంలోని ఈద్గాలో సోమవారం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. క్రమ శిక్షణ, దాతృత్వం, ధార్మిక చింతనల కలయికే రంజాన్ మాసం విశిష్టత అన్నారు. పవిత్ర దివ్య ఖురాన్ అవతరించిన రంజాన్ మాసం అంతా ముస్లింలందరూ నెల రోజులు నియమ, నిష్ఠలతో, కఠోర ఉపవాస దీక్షతో అల్లాహ్‌ను ఆరాధిస్తూ, ఆధ్యాత్మిక జీవనం కొనసాగించాలన్నారు. రంజాన్ పర్వదినం ముస్లిమ్‌ల కుటుంబాలలో సుఖ సంతోషాలు, ఆయురారోగ్యాలతో వెల్లివిరియాలని, అందరి జీవితాల్లో కొత్త వెలుగులు నింపాలని, అందరూ ఐకమత్యంతో, కులమతాలకు అతీతంగా సోదరభావంతో అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ మైలవరం నియోజకవర్గం నాయకుడు సర్నాల తిరుపతిరావు, పట్టణ అధ్యక్షుడు జి.వెంకట్రావు, మాజీ ఎమ్మెల్యే జ్యేష్ఠ రమేష్‌బాబు, రెడ్డిగూడెం మండల టీడీపీ నాయకుడు ఎం.నాగేశ్వర రెడ్డి తదితరులు ముస్లిమ్‌లకు శుభాకాంక్షలు తెలియజేశారు.

భక్తిశ్రద్ధలతో రంజాన్ ప్రార్థనలు

తిరువూరు: రంజాన్ పర్వదినాన్ని తిరువూరు డివిజన్‌లోని ముస్లింలు సోమవారం భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. గత నెలరోజులుగా రంజాన్ ఉపవాస దీక్షలు నిర్వహించిన ముస్లింలు తిరువూరు ఈద్గాలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. జామియా మసీదు ఇమాం మౌల్వీ రజ్వీ ఆధ్వర్యంలో ముస్లింలు ప్రార్థనలు జరిపారు. తమ పితృదేవతల స్మారకార్థం పేదలకు దానధర్మాలు ఆచరించారు. తిరువూరు కౌసర్, బిలాల్ మసీదులు, మునుకుళ్ళ, గానుగపాడు, మల్లేల, ఆంజనేయపురం, రాజుగూడెం గ్రామాల్లోని ముస్లింలు ఈదుల్ ఫితర్ ప్రార్థనల్లో పాల్గొన్నారు. ఎ.కొండూరు మండలంలోని చీమలపాడు, కృష్ణారావు పాలెం, కంభంపాడు గ్రామాల్లో రంజాన్ ప్రార్థనల్లో ముస్లింలు అధికసంఖ్యలో పాల్గొన్నారు. గంపలగూడెం, పెనుగొలను, ఊటుకూరు, జింకలపాలెం, గోసవీడు, వినగడప, కనుమూరు గ్రామాల్లో రంజాన్ ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. తిరువూరు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి నల్లగట్ల స్వామిదాసు తిరువూరు పట్టణంలో జరిగిన రంజాన్ ప్రార్థనల్లో పాల్గొని ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపారు.

ఇబ్రహీంపట్నంలో...

ఇబ్రహీంపట్నం: రంజాన్ మాసం పురస్కరించుకుని గత 29 రోజులుగా చేస్తున్న ఉపవాస దీక్షలు సోమవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా మండలంలోని వివిధ గ్రామాల్లోని మసీదులు, ఈద్గాల వద్ద ముస్లింలు భక్తిశ్రద్ధలతో రంజాన్ వేడుకలు జరుపుకొన్నారు. ఒకరికొకరు ఆలింగనం చేసుకుని ఈద్ ముబారక్ చెప్పుకున్నారు. స్వీట్లు పంచుకున్నారు. పశ్చిమ ఇబ్రహీంపట్నం, కొండపల్లి మసీదుల్లో జరిగిన ప్రత్యేక నమాజులో మాజీ మంత్రి జోగి రమేష్ పాల్గొన్నారు. ముస్లింలు, మతపెద్దలు ఆయనకు స్వాగతం పలికారు. ముస్లింలకు జోగి రమేష్ రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. అల్లా దీవెనలతో రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు. మత గురువు కౌనోరజా రంజాన్ విశిష్టత తెలిపారు. పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు, ముస్లింలు పాల్గొన్నారు.

నూజివీడులో...

నూజివీడు: రంజాన్ పర్వదినం సందర్భంగా గృహ నిర్మాణ మంత్రి కొలుసు పార్థసారధి రంజాన్ పట్టణంలోని ముస్లింలు ప్రార్థనలు నిర్వహించే ఈద్గాకు వెళ్లి వారికి రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. మంత్రి మాట్లాడుతూ ముస్లింల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు.

ఈద్గా వద్ద ప్రార్థనలు

రంజాన్ వేడుకలను సోమవారం ముస్లింలు ఆనందోత్సాహాల నడుమ జరుపుకొన్నారు. పట్టణంలోని మైలవరం రోడ్డులోని ఈద్గా వద్ద పెద్ద ఎత్తున ముస్లింలు తరలివచ్చి భక్తి శ్రద్ధలతో రంజాన్ ప్రార్థనలు నిర్వహించారు. పలువురు ముస్లిం పెద్దలు ఈద్గా వద్దకు చేరుకొని ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. మండలంలోని బోర్వంచ, మీర్జాపురం, తుక్కులూరు, మొర్సపూడి తదితర గ్రామాల్లో రంజాన్ పర్వదినాన్ని ముస్లింలు భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు.

చాట్రాయిలో...

చాట్రాయి: మండలంలోని అన్ని గ్రామాల్లో ముస్లింలు సోమవారం రంజాన్ పర్వదినాన్ని ఘనంగా జరుపుకొన్నారు. చనుబండ, నరసింహారావుపాలెం, సోమవరం, పోలవరం, కోటపాడు, చిన్నంపేట గ్రామాల్లో ముస్లింలు నమాజు చేసి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. స్వీట్లు పంచుకుని శుభాకాంక్షలు తెలుపుకొన్నారు.

ముసునూరులో...

ముసునూరు: మండల వ్యాప్తంగా ముస్లింలు జరుపుకొనే రంజాన్ పండుగ మత సామరస్యానికి ప్రతీకగా నిలిచింది. గోపవరం, చెక్కపల్లి, గుడిపాడు, ముసునూరు గ్రామాల్లో రంజాన్ పండుగను భక్తి శ్రద్ధలతో జరుపుకొన్నారు. నెల రోజులుగా నిర్వహిస్తున్న ఉపవాసాలు ముగిశాయి. ఈద్గాల వద్ద ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. పలువురు ప్రజలు ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు.





ఇబ్రహీంపట్నం మసీదులో మాజీ మంత్రి జోగి రమేష్‌కు స్వీట్లు తినిపిస్తున్న ముస్లింలు ; నూజివీడు పట్టణంలో ఈద్గా వద్ద ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు





గంపలగూడెం మండలం ఊటుకూరులో రంజాన్ ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు ; మైలవరంలోని ఈద్గాలో నమాజు కార్యక్రమంలో పాల్గొన్న ముస్లిమ్‌లు

మైలవరంలో వైభవంగా శోభాయాత్ర

మైలవరం: ద్వారకా తిరుమల దేవస్థానం దత్తత దేవాలయమైన మైలవరంలోని శ్రీవేంకటేశ్వరస్వామి దేవస్థానంలో చైర్మన్ ఎస్‌వీ సుధాకరరావు ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి ఉగాది వేడుకలు అత్యంత ఘనంగా నిర్వహించారు. దేవస్థానం నుంచి నారాయణ నగర్‌లోని పారువేట మండపం వరకు స్వామి వారిని ఊరేగింపుగా తీసుకువెళ్లారు. వివిధ గ్రామాల నుంచి వచ్చిన భజన సమాజాల సభ్యులతో జరిగిన శోభాయాత్రతో స్థానిక నూజివీడు రోడ్డు ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. పారువేట మండపంలో జరిగిన భజన బృందాల అన్నమాచార్య కీర్తనలు, పారాయణ బృందాల లలితా సహస్ర నామ పారాయణలో భక్తులు విశేషంగా పాల్గొన్నారు. దేవస్థానం అర్చకులు విశేష పూజలు నిర్వహించి, పంచాంగ శ్రవణం చేసి ద్వారకా తిరుమల దేవస్థాన పంచాంగాలను, తీర్థప్రసాదాలు భక్తులకు వినియోగించారు.

పాడి రైతుల ఆర్థికాభివృద్ధికి నిరంతర కృషి

ఇబ్రహీంపట్నం: పాడి రైతుల ఆర్థికాభివృద్ధికి కృష్ణా మిల్క్ యూనియన్ నిరంతరం కృషి చేస్తుందని జిల్లా ఫీడ్ కమిటీ సభ్యుడు పజ్జూరి నరసింహారావు తెలిపారు. మైలవరం క్లస్టర్ పాలసేకరణ కేంద్రాల సభ్యుల సమావేశం ఇబ్రహీంపట్నంలో సోమవారం జరిగింది. ఆయన మాట్లాడుతూ గడిచిన ఆర్థిక ఏడాదిలో పాల ఉత్పత్తిదారులకు రూ.50 కోట్లు బోనస్ జిల్లాలో పంపిణీ చేశామన్నారు. ఈ ఏడాది నాలుగు నెలలకు గాను రూ.18 కోట్లు ఏప్రిల్‌లో చెల్లించేందుకు సన్నాహాలు చేస్తున్నామని తెలిపారు. పాడి రైతులకు కిలో ఫ్యాట్‌కు రూ.902 ధర చెల్లిస్తున్నట్లు చెప్పారు. పాడిరైతు నుంచి వసూలు చేసే ప్రతి రూపాయికి 85 శాతం రైతులకు తిరిగి అందజేస్తున్నామన్నారు. ఉత్పత్తిదారులకు మేలైన పశువైద్యం, సబ్సిడీపై పశుగ్రాసం, నాణ్యమైన పశువీర్యం అందిస్తున్నట్లు తెలిపారు. 2025–26 ఏడాదిలో రూ.1350 కోట్లు టర్నోవర్ లక్ష్యాన్ని సంస్థ నిర్దేశించుకుందన్నారు. వివిధ మండలాల పాలసేకరణ కేంద్రం సభ్యులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

భవానీపురం(విజయవాడపశ్చిమ): గొల్లపూడి సెక్షన్ పరిధిలోని 11 కేవీ అట్కిన్‌సన్ స్కూల్ రోడ్ ఫీడర్ లైన్ల మరమ్మతులలో భాగంగా కొన్ని ప్రాంతాల్లో రెండు గంటలపాటు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీసీపీడీసీఎల్ కార్యనిర్వాహక ఇంజినీర్ (విజయవాడ టౌన్) పి.రవీంద్రబాబు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మంగళవారం ఉదయం 8 నుంచి 10 గంటల వరకు జైన్ కాలనీ ఏరియా, ఏసీబీ ఆఫీస్ ఏరియా, బైపాస్ రోడ్ ఏరియా, అమ్మ కల్యాణమండపం ఏరియా, అట్కిన్‌సన్ స్కూల్ రోడ్, శ్రీశైలం కాలని ఏరియా, ఫార్మా కాలేజ్ ఏరియాలలో పైన పేర్కొన్న సమయంలో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు వివరించారు.

చర్చి అభివృద్ధికి ఆర్థిక సాయం

జి.కొండూరు: మండల పరిధిలోని గడ్డమణుగు గ్రామంలో దేవుని పిలుపు శక్తి సంఘం చర్చి అభివృద్ధికి పారిశ్రామిక వేత్త కోగంటి సత్యం రూ.18 వేలను ఆర్థికసాయంగా సోమవారం అందించారు. ఈ నగదును కోగంటి సత్యం తరఫున ఆయన పరిశ్రమలో జనరల్ మేనేజరుగా పని చేస్తున్న శ్రీనివాస్‌ప్రసాద్ చర్చి నిర్వాహకులకు అందజేశారు.

గులాబీలు, కనకాంబరాలతో అర్చన

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): వసంత నవరాత్రోత్సవాల్లో భాగంగా రెండోరోజు సోమవారం ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మకు గులాబీలు, కనకాంబరాలతో అర్చన చేశారు. అర్చన నిర్వహించే పుష్పాలతో ఆలయ డీఈవో రత్నరాజు, ఆలయ అర్చకులు, భక్తులు మేళతాళాలు, మంగళవాయిద్యాలతో ఉదయం 9 గంటలకు అమ్మవారి ప్రధాన ఆలయానికి చేరుకున్నారు. అమ్మవారి మూలవిరాట్‌కు దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపించుకున్న అనంతరం పుష్పార్చన చేశారు. పుష్పాలను భక్తులకు పంపిణీ చేశారు.

ప్రవీణ్ పగడాల మృతిపై నిష్పాక్షిక దర్యాప్తు జరపాలి



ప్రవీణ పగడాల మృతికి సంతాపం తెలుపుతున్న నూజివీడు క్రైస్తవ ఐక్యవేదిక ప్రతినిధులు

నూజివీడు: పాస్టర్ ప్రవీణ్ పగడాల మృతిపై ప్రభుత్వం లోతైన విచారణ జరిపించాలని నూజివీడు క్రైస్తవ ఐక్యవేదిక ఆదివారం డిమాండ్ చేసింది. పట్టణంలో సోమవారం రాత్రి క్రైస్తవ ఐక్యవేదిక ఆధ్వర్యంలో ప్రవీణ్ పగడాల మృతికి సంతాపం తెలిపారు. ఈ సందర్భంగా పలువురు పాస్టర్లు మాట్లాడుతూ ప్రవీణ పగడాల మృతి ఏ విధంగా జరిగిందో స్పష్టంగా తెలపాలన్నారు. పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారని, ఈ పరిస్థితిలో నిష్పక్షపాతంగా దర్యాప్తు చేసి ప్రజలకు నిజానిజాలు తెలియజేయాలన్నారు. అనేక అనుమానాలు, సందేహాలు వస్తున్న తరుణంలో క్రైస్తవులందరూ తీవ్ర అయోమయ స్థితిలో ఉన్నారన్నారు. సభకు స్టాన్లీ ప్రభాకర్ అధ్యక్షత వహించగా, దైవజనులు కేటీ ప్రభాకర్‌రావు, బ్రదర్ బండి శ్యామ్, బ్రదర్ రంజిత్, రాచప్రోలు జోనాథన్, సుశీల్ రావు, నిమ్మగడ్డ చంద్రకుమార్, జీవరత్నం పాల్గొన్నారు.

కళాకారుల సంక్షేమానికి కృషి చేయాలి

విజయవాడ కల్చరల్: సాంస్కృతిక కళా సంస్థలు కళాకారుల సంక్షేమానికి కృషి చేయాలని మహానటి సావిత్రి కళాపీఠం వ్యవస్థాపకురాలు పరుచూరి విజయలక్ష్మి తెలిపారు. సావిత్రి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని కొత్తా పూర్ణానందం కళావేదికమీద సోమవారం సాంస్కృతిక, కళారంగాలకు చెందిన వారికి సత్కార కార్యక్రమం నిర్వహించారు. విజయలక్ష్మి మాట్లాడుతూ కళాకారులు సాంస్కృతిక వారధులని చెప్పారు. ఉగాది పురస్కారాల్లో సాంస్కృతిక, కళారంగాలు, గాయనీ గాయకుల విభాగాన్ని చేర్చి వారికి కూడా ఉగాది పురస్కారాలు ఇవ్వాలని సూచించారు. జ్యోతిష్యశాస్త్ర వేత్త ప్రసూనా రామన్ కళాపీఠం చేస్తున్న కృషిని అభినందించారు. చింతకాయల చిట్టిబాబు, గుడిపాటి హరికృష్ణ, శ్యాంప్రసాద్, టీవీ వీరభద్రరావు డేవిడ్‌రాజు, సత్యవర్ధన్, ఆదిరాల జయప్రభు, కొమ్మినేని రత్నకుమారి, వడ్డాది కామేశ్వరి, తబలా చిట్టిబాబు, కొప్పుల అశోక్, చావా నరసింహారావు, కారుమంచి రాజు, అమాలారాణిలను సత్కరించారు.



కేంద్రం మైనార్టీల హక్కులను హరిస్తోంది : హయత్

భవానీపురం(విజయవాడపశ్చిమ): వక్ఫ్ చట్ట సవరణ పేరుతో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ముస్లిం మైనార్టీల హక్కులను హరిస్తోందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మైనార్టీ నాయకుడు షేక్ హయాత్ షరీఫ్ పేర్కొన్నారు. వక్ఫ్ చట్ట సవరణను వ్యతిరేకిస్తూ పలువురు ముస్లిం మైనార్టీలు విద్యాధరపురం కుమ్మరిపాలెం సెంటర్‌లోని తాజ్ మసీదు వద్ద చేతులకు నల్లరిబ్బన్ కట్టుకుని నిరసన తెలిపారు. ఈసందర్భంగా హయాత్ షరీఫ్ మాట్లాడుతూ వక్ఫ్ ఆస్తులను రక్షిస్తామంటూనే వక్ఫ్ చట్ట సవరణలను చంద్రబాబు కూటమి ప్రభుత్వం వ్యతిరేకించకపోవడం దుర్మార్గం అన్నారు. టీడీపీ వక్ఫ్ చట్ట సవరణలను వ్యతిరేకించి తన లౌకికతత్వాన్ని రుజువు చేసుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో యావత్ ముస్లిం సమాజం వక్ఫ్ చట్ట సవరణలపట్ల తీవ్ర అభ్యంతరాలను తెలుపుతూ నిరసన ప్రదర్శనలు చేస్తుంటే చంద్రబాబు కూటమి ప్రభుత్వానికి చీమ కుట్టినట్లు కూడా లేదని విమర్శించారు. పైకిమాత్రం ముస్లిం మైనార్టీలపై ప్రేమాభిమానాలు ఉన్నట్లు బిల్డప్‌లు ఇస్తున్నారని ఎద్దేవా చేశారు. అధికారం కోసం దిగజారుడు రాజకీయాలకు పాల్పడటం చంద్రబాబు నైజమని విమర్శించారు. ఇప్పటికైనా వక్ఫ్ చట్ట సవరణ బిల్లును వ్యతిరేకిస్తూ స్పష్టమైన ప్రకటన విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో తాజ్ మసీదు కమిటీ సభ్యులు పాల్గొన్నారు.